# విరహజ్వాల

– బి. రమణరాజు

నీ ముద్దుల ముద్రలింకా చెరిగిపోలేదు.
నీ స్పర్శ నిరంతరం నన్ను రగులుస్తూనేవుంది.
నువ్వు తెలీకపూర్వం ఈ తలపులూ లేవు. ఈ నిట్టూర్పులూ లేవు.
నీ రాకతో జీవితం స్వర్గం అయింది.
నీవెళ్ళిపోయాక క్షణ క్షణం నీ ఆలోచనలే.

నిద్రపోతున్న నన్ను మురిపెంగా కౌగిలించుకుని మృదువుగా నువ్వు ముద్దాడుతుంటే...మెలకువ వచ్చినా, అటువంటి మధుర సన్నివేశం మిస్సవుతుందేమోనని నిద్ర నటించిన నేను చివరకు నీ ముందు ఓడిపోయి నిగ్రహం సడలించి నిన్ను నా కౌగిలిలో నలిపేసి-చివరకు యుద్ధంలో గెలిచిన వీరుడిలా నీ ముంగురులు సవరిస్తున్నప్పుడు నువ్వు సిగ్గునభినయించిన సన్నివేశం ప్రతిరాత్రి గుర్తుకు వచ్చి నన్నింకా రెచ్చగొడుతుంది.

మల్లెపూల మంచం మాట వినక నన్ను చులకనగా చూస్తోంది. ఈ అనుక్షణం చెలరేగే విరహాన్ని భరించలేను!

★ ★ ★

చేసే పనుల మీద మనసు లగ్నం కావడం లేదు రవికి.

లాభం లేదని గ్రహించి మూడు రోజులు సెలవు కావాలని రాసి పంపించాడు.

బట్టలు సర్దుకుని బయలుదేరాడు.

బస్సులో ప్రయాణం.

సాయంత్రం ఆరయింది కాకినాడ చేరుకునేసరికి.

బస్టాండులో దిగి ఆటోలో ప్రతాప్ రూంకి బయలుదేరాడు.

ప్రతాప్ ఇంటి పక్కనే రవళి ఇల్లు.

''వాటే సర్‌ప్రయిజ్. ఏమిట్రా ఇది కలా. నిజమా?'' రూం తలుపు తీసుకుని లోపలికి వచ్చిన రవిని చూసి ఆశ్చర్యంగా అడిగాడు ప్రతాప్.

కుశల ప్రశ్నలయ్యాక భోజనం చేసారు మిత్రులిద్దరూ.

''నువ్వెందుకొచ్చావో నా కర్థం అయింది లేరా'' అన్నాడు నవ్వుతూ ప్రతాప్.

చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు రవి.

మెల్లగా అన్ని విషయాలు మాట్లాడిన తరువాత మేడ పైకెక్కాడు రవి.

ప్రక్కనే రవళి ఇల్లు. ఇంట్లో టి.వి ఆన్ చేసినట్లుంది.

అటూ ఇటూ తిరుగుతూ రవళి బయటికి వస్తుందేమోనని చూస్తున్నాడు.

అయిదు నిముషాల తర్వాత రవళి వరండాలోకి వచ్చింది.



రవి చిన్న రాయి తీసుకుని ఆమెకు సమీపంలో పడేటట్లు విసిరేడు.

ఆమె చివ్వున తలెత్తి చూసింది.

సంతోషంతో ఆమె కళ్ళు మెరిసాయి.

గాల్లో స్వీట్ కిసెస్ విసిరాడు. ఆమె అల్లరిగా నవ్వుతూ అందుకుంది. ఆమెకు అర్థమయ్యేటట్లు సైగలు చేసాడు రవి.

ఆనందంగా తలూపింది రవళి.

★ ★ ★

రాత్రి పన్నెండు గంటలయింది.

ప్రతాప్ నిద్రపోతున్నాడు. మెల్లగాలేచి తలుపుతీసుకుని బయటికి నడిచాడు రవి. ప్రహారీ గోడ దూకి రవళీ వాళ్ళ ఇంటి వెనక్కి చేరాడు.

మెల్లగా వెనుక తలుపుతోసాడు. ముందే రవళికి సైగ చేయడం వల్ల ఆమె గడియ తీసి వుంచింది.

లోపలికి అడుగులో అడుగు వేసుకుంటూ నడిచి రవళి రూంలో దూరాడు.

ఆమె చూసీ చూసీ ఆగలేక నిద్రపోయినట్లయింది.

నిద్రలో బట్టలన్నీ చెదిరి బెడ్‌లైట్ వెలుగులో ఆమె అందాలు విందు భోజనంలా ఉన్నాయి.

మెల్లగా ఆమె పక్కలోకి చేరి చేతిని ఆమె గుండెలమీద వేసి తన పెదాలతో ఆమె పెదాలను మూసాడు. నిద్రలో కదిలిందామె. ప్రణయంలో తనెందుకని పైట అడ్డం తొలిగింది.

చేతిని పైకి జరిపి మృదువుగా స్పృశించాడు.

ఆమెకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి చేతుల్తో అతడ్ని మీదకు లాక్కుంది. విరహంతో రగిలిపోతున్న రవి రెచ్చిపోయాడు.

ఆవేశంగా పెనవేసుకుని ఊగిపోతున్న వాళ్ళిద్దరినీ చూసి బెడ్‌లైట్ సిగ్గుపడింది. బెడ్ బరువుగా మూలిగింది.

★ ★ ★

తెల్లారింది.

రవళి తలారా స్నానం చేసి వచ్చింది.

''చెప్పు. రాత్రి నీ గదిలో దూరిన ప్రియుడెవరు?'' కోపంగా అడిగింది రవళి బామ్మ వచ్చి సోఫాలో కూర్చుంటూ.

రవళి ఉలిక్కిపడింది. ఏం చెప్పాలో తెలీక తత్తరపడింది.

''ఊ..ఎన్నాళ్ళుగా సాగుతుంది వ్యవహారం..చెప్పు'' గద్దించింది బామ్మ.

''అదీ..ఆ వచ్చింది..రవి'' సిగ్గుపడుతూ అంది రవళి.

''హా డేర్ యూ..రవీ, కవీ అంటూ పేర్లు కూడా చెబుతావా..నీ కసలు బుద్ధుందా?'' రంకెలేసింది బామ్మగారు.

ఇక లాభం లేదనుకుంది రవళి.

''ఏంటే బామ్మా! తెగ రెచ్చిపోతున్నావ్. రాత్రి నా గదిలో దూరింది సాక్షాత్తూ నాకు తాళికట్టిన మొగుడు రవి. ఏదో ఆషాఢమాసం అడ్డు వచ్చిందని ఆగలేక మా బాధలు మేం పడుతుంటే నీకెందుకే మధ్యలో..హు''-

''ఆ...ఆ....నాకు తెలుసులే. కావాలనే నేను నిన్ను బెదరకొట్టా. అయినా ఆ రోజుల్లో మీ తాతగారు కూడా..'' బోసిబుగ్గల్లో సిగ్గు!

''బామ్మా! ఫ్లాష్‌బ్యాక్ ఆపుతావా?'' అరిచింది రవళి.

★